ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 42 | సోమవారం 13, అక్టోబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## నల్గొండకు గోదావరి జలాలు ఆయన చలవే

- ఎస్సారెస్పీ2 ప్రాజెక్టుకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు ఖరారు
- తుంగతుర్తి సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 24 గంటల్లోనే జీవో జారీ చేస్తామని వెల్లడి
- దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ
- ఆయన మృతికి సోనియా, ఖర్గే, రాహుల్ సంతాపం తెలిపారన్న సీఎం

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

శ్రీరాం సాగర్ రెండో దశకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 24 గంటల్లోగా దీనికి సంబంధించిన జీవో కూడా జారీ చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వీహెచ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నేతలు ఎస్సారెస్పీ2కి దామోదర్ రెడ్డి పేరు నామకరణం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ఒక వినతి పత్రం కూడా అందజేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన దామోదర్ రెడ్డి సంతాప సభకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్సారెస్పీ2 దశకు దామోదర్ రెడ్డి పేరు నామకరణం చేయడానికి అన్ని పక్షాలు కూడా మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సారెస్పీ 2 దశకు దామోదర్ రెడ్డి పేరు పెట్టడమే ఆయనకు ఇచ్చిన అసలైన నివాళులు అంటూ ఆయన చెప్పుకొచ్చారు.అంతేకాదు ఆయన త్యాగాలు గౌరవాన్ని గుర్తిస్తాయని తెలిపారు.దామోదర్ రెడ్డి మృతి చెందడం ఎంతో బాధాకరమని సంతాపాన్ని ప్రకటించారు. తన జీవితమంతా ప్రజలకే అర్పించాడని కొనియాడారు. ముఖ్యంగా ఒకసారి రాజకీయాల్లో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వారు ఆస్తులు కూడా పెట్టుకుంటే 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసిన దామోదర్ రెడ్డి తన వారసత్వం నుండి వచ్చిన మిగతా 2లో..

# అయోమయంలో హస్తం



- బీసీ రిజర్వేషన్లపై ఏం చేద్దాం?
- సుప్రీంకోర్టులో తీర్పు వ్యతిరేకంగా వస్తే పరిస్థితి ఏమిటి?
- తీవ్ర ఆగ్రహంగా బీసీ సంఘాలు
- బీసీ వర్గాలను ఆశపెట్టిన ఏమార్చిన వైనం
- పార్టీపరంగా రిజర్వేషన్లు ఇస్తే పరిస్థితి ఏమిటి?
- బీజేపీని ద్రోహిగా చిత్రీకరిస్తున్న కాంగ్రెస్



**హైదరాబాద్, ప్రజాస్వరం:**


తెలంగాణ రాజకీయాల్లో మరోసారి బీసీ రిజర్వేషన్ల అంశం చర్చకు వస్తోంది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ వ్యవహారంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ పార్టీ వ్యూహం ఒక్కసారిగా తారుమారైంది. స్థానిక సంస్థలలో బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను హైకోర్టు రద్దు చేయడం, ఆ నిర్ణయం వెనుక చట్టపరమైన సవాళ్లు, రాజకీయ లెక్కలన్నీ కలిసిపోయాయి. ఈ పరిణామంతో బీసీ సంఘాలు, వర్గాల మధ్య కాంగ్రెస్‌పై ఆగ్రహం పెరిగినట్లు కనిపిస్తోంది.

**బీసీ రిజర్వేషన్లతో ఓటు బ్యాంక్ ఆకర్షణ**

2023 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొదటి నుంచీ "సామాజిక న్యాయం" పేరుతో బీసీలను ఆకర్షించే ప్రయత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీకి బీసీ వర్గాల ఓటు శాతం తక్కువగా ఉందనే అంచనాల నేపథ్యంలో, రిజర్వేషన్ల రూపంలో ఆ వర్గాల మద్దతును పొందే యత్నం చేసింది. ముఖ్యంగా పంచాయతీ రాజ్, మున్సిపల్, జెడ్పీ స్థాయిలలో బీసీలకు 43 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే, రాజ్యాంగం ప్రకారం మొత్తం రిజర్వేషన్లు (SC, ST, BC కలిపి) 50 శాతం మించకూడదన్న నిబంధన ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పరిమితిని లెక్కచేయకుండా ముందుకు సాగింది. ఫలితంగా హైకోర్టులో కేసు దాఖలయింది. హైకోర్టు ఆ జీఓను రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ కొట్టేసింది.

**బీసీ సంఘాల ఆగ్రహం**

ఈ తీర్పు తర్వాత బీసీ సంఘాలు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశాయి. "మమ్మల్ని మళ్లీ మోసం చేశారనే" వాదనతో ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశాయి. ఎన్నికల సమయంలో బీసీ వర్గాల మద్దతు పొందాలని కాంగ్రెస్ భావించి, చట్టపరమైన స్థిరత్వం లేని నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. అనేక బీసీ నేతలు మిగతా 2లో..



## స్నేహితుడే కాలాంతకుడు

- పశ్చిమబెంగాల్ మెడికో సామూహిక లైంగిక దాడి ఘటన కేసులో పురోగతి
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

02



## అమెరికా చైనా వాణిజ్య ఘర్షణ

- 100% టారీఫ్‌ల యుద్ధం మరింత తీవ్రం
- తాము వెనక్కి తగ్గబోమన్న చైనా

03

## భారత్ తో బంధాన్ని విలువైనది


- భారత్‌కు అమెరికా కొత్త రాయబారిగా సెర్గియో గోర్
- బాధ్యతలు స్వీకరించకముందే ప్రధాని మోదీతో కీలక సమావేశం
- మోదీని ట్రంప్ గొప్ప స్నేహితుడిగా భావిస్తారన్న రాయబారి
- రక్షణ, వాణిజ్యం, టెక్నాలజీ, కీలక ఖనిజాలపై ఫలప్రదమైన చర్చ
- మోదీకి ట్రంప్ సంతకంతో కూడిన ప్రత్యేక ఫొటో బహూకరణ



02

# బనకచర్లపై మళ్లీ వివాదం

- ప్రాజెక్టుకు అనుమతులు పొందేందుకు ఏపీ యత్నం
- తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవడం లేదన్న బీఆర్ఎస్
- తాము అడ్డుకుంటున్నామని చెబుతున్న కాంగ్రెస్
- అసలు ఏమిటీ బనకచర్ల వివాదం
- మిగులు జలాలే మీద ప్రాజెక్టు కడుతున్నామంటున్న ఏపీ
- గోదావరికి మిగులు జలాలే లేవన్నది తెలంగాణ వాదన



**హైదరాబాద్, ప్రజాస్వరం:**

తెలంగాణ రాష్ట్రంలో గోదావరి జలాల వినియోగంపై మరోసారి ఉద్రిక్తతలు రేగాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టు చుట్టూ వివాదం మళ్లీ చెలరేగింది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆమోదం పొందేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో తెలంగాణ రాజకీయ రంగం మండి పడింది. కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి మిగతా 3లో..

# కారు కావాలా, బుల్డోజర్ కావాలా



- కాంగ్రెస్ పేదల ఇళ్లు కూల్చివేస్తుందని తీవ్ర ఆరోపణ
- రెండేళ్లలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శ
- ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్
- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పిలుపు
- బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీ అని ఎద్దేవా

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన మిగతా 2లో..

## పాకిస్థాన్, అఫ్గాన్ బలగాల మధ్య ఘర్షణలు

- అసలు ఈ వివాదానికి కారణం ఏమిటి?
- తెహ్రీక్ ఇ తాలిబాన్ పాకిస్థాన్ అసలు కారణమా?



# స్నేహితుడే కాలాంతకుడు

- **పశ్చిమబెంగాల్ మెడికో సామూహిక లైంగిక దాడి ఘటన కేసులో పురోగతి**
- **ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

పశ్చిమబెంగాల్‌లోని దుర్గాపూర్‌లో ఓ యువ వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన ఈ రాష్ట్రంలో తీవ్ర ఆందోళన సృష్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటివరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నప్పటికీ వారి వివరాలు వెల్లడి కాలేదు. బాలేశ్వర్ జిల్లా వారసు 23 ఏళ్ల యువతి దుర్గాపూర్‌లోని శోభాపూర్ సమీపంలోని ఒక ప్రైవేట్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండవ సంవత్సర చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితుడితో బయటకు వెళ్లిన సమయంలో కొంతమంది దుండగులు వారిని అనుసరించారని పోలీసులు తెలిపారు. బాధితురాలిని బెదిరించి సమీప అడవిలోకి తీసుకెళ్లి ఘోరమైన అత్యాచారానికి గురిచేశారని ఫిర్యాదులో వివరించారు. తనను ఎవరికైనా ఫిర్యాదు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరింపులు వచ్చాయని బాధితురాలు తెలిపారు. తీవ్ర రక్తస్రావంతో స్పృహ కోల్పోయిన ఆమెను స్థానికులు గుర్తించి సమీప ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమె ఐసీయూలో చికిత్స పొందుతోంది. తల్లిదండ్రులు శనివారం ఉదయం దుర్గాపుర్ చేరి కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో, బాధితురాలి స్నేహితుడు కూడా ఈ ఘటనలో భాగమై, ఆమెను తప్పుదారి పెట్టిన తర్వాత ఫోన్, డబ్బులను లాక్కొన్నట్టు గుర్తించబడింది. పోలీసులు బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసి, వివిధ వ్యక్తులను విచారిస్తున్నారని, నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేస్తున్నారని తెలిపారు. సదరు ఘటనపై తప్పుడు సమాచారం వ్యాప్తి కాకుండా ప్రజలను హెచ్చరించారు.



# భారత్‌కు అమెరికా కొత్త రాయబారిగా సెర్గియో గోర్

- **అధ్యక్షుడు ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు**
- **బాధ్యతలు స్వీకరించకముందే ప్రధాని మోదీతో కీలక సమావేశం**
- **మోదీని ట్రంప్ గొప్ప స్నేహితుడిగా భావిస్తారన్న రాయబారి**
- **రక్షణ, వాణిజ్యం, టెక్నాలజీ, కీలక ఖనిజాలపై ఫలప్రదమైన చర్చ**
- **మోదీకి ట్రంప్ సంతకంతో కూడిన ప్రత్యేక ఫొటో బహూకరణ**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

భారత్‌అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన శకం ప్రారంభమైందని, దీనికి ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బలమైన నాయకత్వమే కారణమని భారత్‌లో అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ అన్నారు. ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న 38 ఏళ్ల గోర్, అమెరికా చరిత్రలోనే అత్యంత పిన్నవయస్కుడైన రాయబారిగా రికార్డు సృష్టించారు. అధికారికంగా బాధ్యతలు స్వీకరించడానికి ముందే ఆయన ఢిల్లీలో పర్యటిస్తూ, కీలక సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అక్టోబర్ 9న ఢిల్లీ చేరుకున్న సెర్గియో గోర్, తన ఆరు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీలతో సమావేశమయ్యారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రక్షణ, వాణిజ్యం, టెక్నాలజీ, ఇంధన భద్రతకు అవసరమైన కీలక ఖనిజాల వంటి అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా, ట్రంప్ పంపిన ఒక ప్రత్యేక బహుమతిని గోర్ ప్రధాని మోదీకి అందించారు. గతంలో వైట్‌హౌస్‌లో ఇరువురు నేతలు కలుసుకున్నప్పటి ఫొటోపై "మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, మీరు గొప్పవారు" అని ట్రంప్ స్వయంగా రాసి సంతకం చేసి పంపారు.

సమావేశం అనంతరం గోర్ మాట్లాడుతూ, "ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా జరిగింది. భారత్‌తో ఉన్న బంధాన్ని అమెరికా ఎంతో విలువైనదిగా భావిస్తుంది. అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని మోదీని ఒక గొప్ప, వ్యక్తిగత మిత్రుడిగా భావిస్తారు. నేను ఢిల్లీ బయలుదేరడానికి ముందు కూడా ఇద్దరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. వారి మధ్య ఈ సంప్రదింపులు రానున్న రోజుల్లోనూ కొనసాగుతాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తాను," అని తన అధికారిక ప్రకటనలో తెలిపారు. సోవియట్ యూనియన్‌లో జన్మించి అమెరికా పౌరసత్వం పొందిన సెర్గియో గోర్, ట్రంప్ ప్రభుత్వంలో వైట్‌హౌస్ పర్సనల్ ఆఫీస్ డైరెక్టర్‌గా పనిచేసి అత్యంత శక్తివంతుడైన వ్యక్తిగా పేరుపొందారు. ఆసియాలో చైనా ప్రాబల్యాన్ని ఎదుర్కోవడంలో భారత్ పాత్రను ట్రంప్ ప్రభుత్వం కీలకంగా భావిస్తున్న నేపథ్యంలో గోర్ నియామకం వ్యూహాత్మకంగా కనిపిస్తోంది. అయితే, వాణిజ్య సుంకాలు, హెచ్1బీ వీసాల వంటి అంశాలు ఇరు దేశాల మధ్య సవాలుగా మారే అవకాశం ఉంది. ఈ నెల 14న గోర్ తన పర్యటన ముగించుకుని తిరిగి వెళ్లనున్నారు. ఆయన పర్యటన, మారుతున్న ప్రపంచ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో "మోదీట్రంప్ 2.0" శకానికి నాంది పలుకుతోందని, ఇది ఇండోపసిఫిక్ ప్రాంతంలో భద్రత, స్థిరత్వానికి దోహదపడుతుందని అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.





# నల్గొండకు గోదావరి జలాలు ఆయన చలవే

**మొదటిపేజీ తరువాయి**

ఆస్తులను ప్రజల కోసం కరగదీశాడని పేర్కొన్నారు. కక్షలు,కార్పన్యాలు,హత్య రాజకీయాలతో అట్టుడికి పోయిన తుంగతుర్తి ప్రాంతంలో వాటన్నింటినీ ఎదుర్కొంటూ కాంగ్రెస్ జెండాను నిలబెట్టాడని గుర్తు చేశారు. ఒకవైపు క్యాడర్ ను కాపాడుకుంటూనే మరోవైపు నీళ్లు లేక ఎడారిల మారిపోతూ ఫ్లోరైడ్ పట్టిపీడిస్తున్న తరుణంలో దామోదర్ రెడ్డి తుంగతుర్తి ప్రాంతానికి ఎస్సారెస్పీ నీళ్లు తేవడానికి ఉద్యమాలు సాగించాలని పేర్కొన్నారు. కరీంనగర్,వరంగల్ జిల్లాలకు వస్తున్న నీళ్లు తమ జిల్లాకు తెచ్చుకొని సస్యశ్యామలం చేయాలనే దృఢ సంకల్పంతో ఆయన ముందుకు సాగారని వివరించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో ఎస్సారెస్పీ కాలువ కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి దాన్ని సాధించడంలో దామోదర్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు.ముఖ్యంగా రిజర్వేషన్ల పరంగా తుంగతుర్తి నియోజకవర్గం వదిలి సూర్యాపేటకు వెళ్లినప్పటికీ కూడా దామోదర్ రెడ్డి సొంత ప్రాంతాన్ని ఏనాడు మర్చిపోలేదని అన్నారు.ఖమ్మం జిల్లాలోని ఒకప్పటి సుజాతనగర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం నుండి ప్రాతినిధ్య వహించిన దామోదర్ రెడ్డి సోదరులు ఇద్దరు కాంగ్రెస్ పార్టీకి జోడిద్దుల్లాగా జెండాను మోసారని గుర్తుచేశారు. ఇది ఇలా ఉంటే దామోదర్ రెడ్డి మృతి వార్తపట్ల ఏఐసీసీ కూడా తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసిందని తెలిపారు. అంతే కాకుండా రాహుల్ గాంధీ సంతాప సందేశాన్ని పంపారని తెలిపారు. సోనియాతో పాటు రాహుల్ గాంధీ, నేత ఖర్గే తదితరులు దామోదర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటున్నట్లు హామీ ఇస్తున్నట్లుగా తనతో చెప్పమన్నారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తు రాజకీయాల పరంగా కుమారుడు సర్వోత్తమ రెడ్డికి అండగా ఉంటున్నట్లు తెలిపారని ఆయన వివరించారు.

# అయోమయంలో హస్తం



**మొదటిపేజీ తరువాయి**

ఇలా వ్యాఖ్యానిస్తున్నారు – "రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పు వస్తుందని ముందుగానే తెలుసు. అయినా కూడా, ఆ రాజకీయ ప్రయోజనాల కోసం నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు మమ్మల్ని సుప్రీంకోర్టు పేరు చెప్పి మోసం చేయబోతోందా?" అని ప్రశ్నిస్తున్నారు.

**కాంగ్రెస్ వ్యూహం తడబాటు దశలో**

బీసీ రిజర్వేషన్లలో హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి కఠిన సవాలు. ఎన్నికలకు ముందు "బీసీ మంత్రం" పనిచేస్తుందని భావించిన ఆ పార్టీకి ఇప్పుడు అది రాజకీయ బూమరాంగ్‌గా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతు రుణమాఫీ ఆలస్యం, విద్యుత్ సరఫరా సమస్యలు, ఉద్యోగ నియామకాల్లో గందరగోళం వంటి అంశాలపై ప్రభుత్వం విమర్శలపాలవుతోంది. ఇప్పుడు బీసీ వర్గాల మద్దతు కూడా సడలిపోతే, కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో తీవ్రమైన దెబ్బ తినే అవకాశం ఉంది. దానిని దృష్టిలో ఉంచుకుని పార్టీ తక్షణ వ్యూహం మార్చుకోవాల్సి వచ్చింది.

**సుప్రీంకోర్టులో కొత్త పోరాటం**

హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ముందస్తు విచారణకు అంగీకరించి, త్వరలో వాదనలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం "బీసీలకు సముచిత ప్రతినిధిత్వం కల్పించడానికి" రాజ్యాంగబద్ధమైన మార్గంలో రిజర్వేషన్లు ఇచ్చామని వాదిస్తోంది. అయితే న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ కేసులో ప్రభుత్వం గెలిచే అవకాశాలు అంతగా బలంగా కనిపించడం లేదు. ఎందుకంటే 50 శాతం పరిమితి సుప్రీంకోర్టు ఇంద్రసావ్నీ కేసు తీర్పుతో స్పష్టంగా నిర్ధారించబడింది. ఆ పరిమితిని మించడానికి ప్రత్యేక రాజ్యాంగ సవరణ అవసరం. తెలంగాణ ప్రభుత్వం ఆ మార్గాన్ని అనుసరించలేదు.

**బీసీ ఓటు బ్యాంక్‌పై ప్రభావం**

బీసీలు తెలంగాణలో కీలక ఓటు బ్యాంక్. వివిధ అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా బీసీ వర్గాల ఓటర్లు 50 శాతం వరకు ఉంటారు. ఈ వర్గం సంపూర్ణంగా ఒకే పార్టీ వైపు మొగ్గడం అరుదు అయినప్పటికీ, ఎన్నికల్లో ఫలితాలను నిర్ణయించే శక్తి వీరికి ఉంది. ఇప్పటి వరకు బీసీలకు బలమైన రాజకీయ ఆధారం కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ వద్ద ఉండేది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాలను తనవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేసింది. రిజర్వేషన్లు, బీసీ కార్పొరేషన్ నిధులు పెంపు, బీసీ ఫెడరేషన్ బలోపేతం వంటి చర్యలు తీసుకుంది. కానీ ఇప్పుడు హైకోర్టు తీర్పుతో ఆ యత్నాలన్నీ నిలిచిపోయాయి. బీసీలు తిరిగి బీఆర్ఎస్ లేదా బీజేపీ వైపుకు మొగ్గవచ్చనే ఆందోళన కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

**విపక్షాల రాజకీయ లాభం**

హైకోర్టు తీర్పుతో బీజేపీ, బీఆర్ఎస్ లకు కొత్త రాజకీయ ఆయుధం దొరికింది. ఈ రెండు పార్టీలు కూడా కాంగ్రెస్‌పై బీసీలను మోసం చేసిందని ఆరోపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలు "మేము అధికారంలో ఉన్నప్పుడు చట్టపరంగా సర్వే చేసి, రిజర్వేషన్లను పునర్వ్యవస్థీకరించడానికి ప్రయత్నించాం. కానీ కాంగ్రెస్ కేవలం ప్రకటనల రాజకీయమే చేసింది" అని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక బీజేపీ మాత్రం "కాంగ్రెస్ పార్టీ బీసీ హక్కులపై నిజమైన కట్టుబాటు లేని పార్టీ" అని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ బీసీ మోర్చా ఇప్పటికే గ్రామస్థాయిలో దూకుడు పెంచింది.

**కాంగ్రెస్ కొత్త వ్యూహం ఏంటి?**

ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి రెండు మార్గాలే ఉన్నాయి ––

1. న్యాయపరమైన పరిష్కారం కోసం సుప్రీంకోర్టు తీర్పును వేచి చూడటం
2. బీసీ వర్గాల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రభుత్వం "బీసీ సాధికారత ప్యాకేజ్" పేరుతో కొత్త పథకాన్ని సిద్ధం చేస్తోంది. ఇందులో బీసీలకు వ్యాపార రుణాలు, నైపుణ్య శిక్షణ, విద్యా రాయితీలు వంటి అంశాలు ఉండవచ్చని చెబుతున్నారు. అదే సమయంలో, పార్టీ నేతలు బీసీ సంఘాలతో వరుసగా సమావేశాలు నిర్వహించి, వారి ఆందోళనలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.

**రేవంత్‌రెడ్డి ముందున్న సవాలు**

రాష్ట్ర రాజకీయ వేదికపై ఇప్పుడు రేవంత్‌రెడ్డి పెద్ద సవాల్ ఎదుర్కొంటున్నారు. ఆయన నాయకత్వంపై కాంగ్రెస్‌లోనూ, బయటా ప్రశ్నలు మొదలయ్యాయి. "బీసీ మంత్రం" విఫలమైతే, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తడబడే అవకాశం ఉంది. మరోవైపు, బీసీల అసంతృప్తి పెరిగితే ఆ పార్టీ భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుంది. మొత్తానికి, బీసీ రిజర్వేషన్ల అంశం కాంగ్రెస్ పార్టీకి రాజకీయ పరీక్షగా మారింది. బీసీ వర్గాలను ఆకర్షించాలనే ఉద్దేశం మంచిదే అయినా, చట్టపరమైన దారుల్లో నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రయత్నం తిరగబడింది. ఇప్పుడు ఆ పార్టీ దృష్టి పూర్తిగా సుప్రీంకోర్టు తీర్పుపైనే కేంద్రీకృతమైంది. తీర్పు అనుకూలంగా వస్తే కాంగ్రెస్ మళ్లీ బీసీలకు "మేమే నిజమైన మద్దతుదారులు" అని చెప్పగలదు. కానీ ప్రతికూలంగా వస్తే — ఆ పార్టీకి ఇది పెద్ద రాజకీయ దెబ్బ అవుతుంది. ఈ నేపథ్యంలో "బీసీ మంత్రం" కాంగ్రెస్‌కు వరమా, శాపమా అన్నది వచ్చే నెలల్లో తేలనుంది.

# కారు కావాలా, బుల్డోజర్ కావాలా

**మొదటిపేజీ తరువాయి**

'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

**హామీలన్నీ మోసమే...!**

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.

**బీజేపీపైనా విమర్శలు**

ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.





# చంద్రబాబుకు మోదీ శుభాకాంక్షలు

- **సీఎంగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు ప్రత్యేక అభినందనలు**
- **చంద్రబాబు దార్శనికత, సుపరిపాలనను కొనియాడిన ప్రధాని**
- **ప్రధాని శుభాకాంక్షలకు ధన్యవాదాలు తెలిపిన చంద్రబాబు**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అరుదైన మైలురాయిని పురస్కరించుకుని ప్రధాని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు నాయకుల మధ్య జరిగిన ఈ సంభాషణ వారి మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ జీవితంలో ఆయన దార్శనికత, సుపరిపాలన పట్ల నిబద్ధత స్థిరంగా కొనసాగాయని ప్రశంసించారు. "2000ల ప్రారంభంలో తామిద్దరం ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటి నుంచి అనేక సందర్భాల్లో కలిసి పనిచేశాం," అని మోదీ గుర్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమం కోసం చంద్రబాబు ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఆయనకు అన్నివిధాలా శుభాకాంక్షలు తెలుపుతున్నానని మోదీ అన్నారు. ప్రధాని మోదీ ఫోన్ కాల్, ఆయన తెలిపిన శుభాకాంక్షలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "మీ దార్శనిక నాయకత్వంలో 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించడంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలక శక్తిగా నిలబెడతాం. మీ మద్దతుతో స్వర్ణాంధ్రను నిర్మించేందుకు నేను పూర్తి నిబద్ధతతో ఉన్నాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని మోదీ దయతో కూడిన మాటలకు, ఆయన ఫోన్ కాల్ కు తాను ఎంతో సంతోషిస్తున్నానని పేర్కొన్నారు.

# బాణాసంచా విక్రయాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**



బాణాసంచా విక్రయాలకు దుకాణాల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో ఎస్పీ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా మెదక్ జిల్లా పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తమ తమ సంబంధిత సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని ముందస్తుగా అనుమతి పొందాలని తెలిపారు. దీనికి సంబంధించిన ఇతర వివరాలు, మార్గదర్శకాలు కోసం సంబంధిత సబ్ డివిజనల్ పోలీస్ అధికారిని సంప్రదించాలని కోరారు. అలాగే ఎటువంటి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు నెలకొల్పిన వారు పట్ల ఎక్స్ప్లొసివ్ యాక్టు - 1884, రూల్స్ - 1933 (సవరణ 2008) ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. టపాకాయల దుకాణాలు ఖాళీ ప్రదేశాలలో మాత్రమే నెలకొల్పాలని, ఆ ప్రదేశానికి సంబంధించి ఎన్ఓసీ సర్టిఫికేట్ తప్పనిసరిగా పొందాలని అన్నారు. ఒక క్లస్టర్లో 50 షాపులకు మించరాదని అన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో, కళ్యాణ మండపాలు లేదా సమావేశ కేంద్రాలలో టపాకాయల షాపులు ఏర్పాటు చేయరాదనీ అన్నారు. తాత్కాలిక టపాకాయల షాపుల్లో అగ్నికి సంబంధించిన భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును సంబంధిత డీఎస్పీ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు.

# అమెరికా- చైనా వాణిజ్య ఘర్షణ

- **100% టారీఫ్‌ల యుద్ధం మరింత తీవ్రం**
- **తాము వెనక్కి తగ్గబోమన్న చైనా**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధించనున్నట్లు తాజాగా ప్రకటించడం గ్లోబల్ వాణిజ్య వర్గాలలో హడావిడి రేపింది. ఈ నిర్ణయం నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా తీరుపై చైనా (China) వాణిజ్య మంత్రిత్వ శాఖ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ట్రంప్ చర్యలు చైనా ఆర్థిక ప్రయోజనాలకు హానికరంగా ఉంటాయని, ఇరుదేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక చర్చల వాతావరణాన్ని దెబ్బతీస్తాయని చైనీస్ వర్గాలు హెచ్చరించాయి. చైనా మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం, "అమెరికా ఏకపక్షంగా తీసుకునే చర్యలు అంతర్జాతీయ వాణిజ్య నియమాలను అవహేళన చేస్తున్నాయి. తాము సాధారణంగా ఎవరి వద్దకు పోరాడమని వెళ్లమని కోరలేదు, కానీ అవసరమైతే పరిరక్షణ చర్యలు (countermeasures) తప్పక తీసుకుంటాము" అని స్పష్టం చేసింది. అమెరికాచైనా మధ్య వాణిజ్య వివాదాలు కొత్త దశలోకి ప్రవేశించాయని, దీనికి ప్రతిస్పందనగా చైనా తన స్వంత తుదిమేరలను ఖరారు చేసిందని తెలిపింది.



తాజా పరిణామాల వెనుక రాజకీయ వాతావరణంలో, ట్రంప్ ఇటీవల అరుదైన ఖనిజాలు, టెక్నాలజీ ఉత్పత్తుల ఎగుమతులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అమెరికా సుంకాల విధింపుల ద్వారా చైనా మార్కెట్‌పై ప్రభావం చూపాలని, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోని భేటీని కూడా రద్దు చేయవచ్చని హెచ్చరించారు. ఈ చర్యలతో అమెరికాచైనా మధ్య ఇప్పటికే కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రత చెందబోతోంది.గత కొన్ని సంవత్సరాలుగా అమెరికాచైనా వాణిజ్య యుద్ధం గ్లోబల్ మార్కెట్లలో తీవ్ర ప్రభావం చూపింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు, టెక్నాలజీ బిజినెస్, ఖనిజాలు, ఐటీ ఉత్పత్తులు, మరియు వ్యవసాయ సరుకు లాంటి విభాగాలు ప్రధానంగా దెబ్బతిన్నాయి. గతంలో ట్రంప్ ప్రభుత్వం చైనా నుండి దిగుమతులపై 30 శాతం వరకు సుంకాలు విధించింది. ఆ చర్యలకు ప్రతిస్పందనగా చైనా కూడా అమెరికాకు వ్యతిరేకంగా 30 శాతం సుంకాలు విధించింది. ఇరుదేశాల మధ్య వివాదాలను తగ్గించడానికి అనేక రౌండ్ల చర్చలు జరిగాయి. ట్రేడ్ డీల్‌లు కూడా కొన్ని సందర్భాల్లో ఒప్పందం దిశగా వెళ్లినప్పటికీ, అవి తాత్కాలిక పరిష్కారాలే కావడంతో మిగతా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకారం, "అమెరికా చర్యలు ద్వంద్వ ప్రమాణాల (double standards) నేపథ్యంలో తీసుకోవడం గమనార్హం. తాము సాంకేతికంగా, ఆర్థికంగా తగిన ప్రతిస్పందనలు తీసుకుంటాము. అమెరికాచైనా మధ్య వాణిజ్య సంబంధాలను, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థను రక్షించడం ప్రధాన లక్ష్యం" అని పేర్కొంది. అమెరికా పరిశ్రమల్లో ట్రంప్ టారీఫ్‌ల యుద్ధం వల్ల భవిష్యత్ మార్కెట్లలో ఎగువలలో, ధరల పెరుగుదలకు కారణమయ్యే అవకాశాలు ఉన్నట్లు ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. చైనాఅమెరికా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగితే, గ్లోబల్ సప్లై చైన్‌లపై నష్ట ప్రభావం పడుతుంది. విశ్లేషకులు, "భవిష్యత్తులో కూడా ట్రంప్ ప్రభుత్వం ఏవిధమైన మరిన్ని సుంకాలు విధించనుందో, చైనా ప్రతిస్పందనలో ఏ స్థాయికి వెళ్తుందో గమనించాలి" అని సూచిస్తున్నారు. ప్రస్తుతం, రెండు దేశాలు కూడా గ్లోబల్ మార్కెట్లను స్థిరంగా ఉంచడం అవసరమని భావిస్తాయి. కానీ జాతీయ ఆర్థిక, వ్యాపార ప్రయోజనాల కోసం తీసుకునే చర్యలు, వాణిజ్య యుద్ధానికి దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ట్రంప్‌చైనా మధ్య వాణిజ్య సంబంధాలు భవిష్యత్తులో ఎలా ప్రవర్తిస్తాయన్నది, ప్రపంచ ఆర్థిక వ్యాప్తంగా వేగంగా మారే అంశంగా మారింది .ఈ క్రమంలో, అమెరికాచైనా వాణిజ్య ఘర్షణ కొత్త దశలోకి ప్రవేశించినందున, గ్లోబల్ మార్కెట్, ఎగుమతిదారులు, దిగుమతిదారులు, మరియు సాధారణ వినియోగదారులపై దీర్ఘకాల ప్రభావం ఉండే అవకాశముందని ఆర్థిక విశ్లేషకులు జాగ్రత్తగా సూచిస్తున్నారు.

# పాకిస్థాన్, అఫ్ఘాన్ బలగాల మధ్య ఘర్షణలు

**హైదరాబాద్, ప్రజాస్వరం**

పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఖైబర్‌పఖ్తుంక్వా, బలూచిస్థాన్‌డాన్ ప్రాంతాల సరిహద్దుల్లో ఇరువైపులుగా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. శనివారం రాత్రి తాలిబాన్ బలగాలు పాక్ సరిహద్దులపై కాల్పులు జరిపినట్లు సమాచారం. అనంతరం అఫ్ఘాన్ సైనికులు కూడా పాక్ సరిహద్దులను లక్ష్యంగా ప్రతీకార దాడులు ప్రారంభించారు. ఈ ఘర్షణల్లో అనేక పాక్ సైనికులు మృతి చెందినట్లు పాక్ రక్షణ సంస్థలు ప్రకటించాయి.




సరిహద్దు ఉత్కంఠకు కారణమయ్యే ఘటనలు ఈ వారంలో ప్రారంభమయ్యాయి. గురువారం, అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబుల్‌లో తెహ్రీక్ ఇ తాలిబాన్ పాకిస్థాన్ చీఫ్ నూర్ వాలి మెహ్సూద్ స్థావరాన్ని లక్ష్యంగా పాక్ ఫైటర్ జెట్లు దాడి చేసినట్లు తాలిబాన్ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ఆరోపించారు. ఈ దాడులు “ప్రతీకారం” అని అఫ్ఘాన్ అధికారులు పేర్కొన్న విషయం తెలిసిందే. తాలిబాన్ సైన్యాలు, పాక్ బలగాలు సరిహద్దు నియమాలను ఉల్లంఘిస్తే, మరింత ఉద్ధృత దాడులు జరుగుతాయని హెచ్చరించారు. వాస్తవానికి, టీటీపీ (తెహ్రీక్ ఇ తాలిబాన్ పాకిస్థాన్) సమస్య ఈ ఘర్షణల వెనుక ప్రధాన కారణంగా నిలిచింది. టీటీపీ పాకిస్థాన్‌లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఉగ్రవాద సంస్థగా ఉంటుంది. పాక్ సైన్యం వీటిని అడ్డుకోవడానికి క్రమంగా వైమానిక దాడులు, సరిహద్దు రౌండ్ అప్‌లు నిర్వహిస్తున్నా, టీటీపీకి అఫ్ఘానిస్థాన్ భూభాగం సురక్షిత ప్రాంతాలుగా మారడం, సరిహద్దులలో దళాలు స్వేచ్ఛగా కదలడానికి అవకాశం కల్పించింది. కాబట్టి, పాక్ ఫైటర్ జెట్లు కాబుల్‌లోని టీటీపీ స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడం, అఫ్ఘాన్‌పాక్ మధ్య ఉద్రిక్తతకు ప్రధాన కారణమైపోయింది. ఈ ఘర్షణలు ప్రాంతీయ రాజకీయ పరిణామాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ భారత పర్యటనలో ఉన్న సమయంలో ఈ దాడులు జరిగడం, అంతర్జాతీయ మేధావులు, పరిధీయ పాలకులతో సమన్వయం లేకుండా తీసుకోవడం అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో, ప్రాంతీయ భద్రతా పరిస్థితులు మరింత ఉద్రిక్తం అవుతాయి. భౌగోళిక పరిస్థితులు కూడా ఉద్రిక్తతకు కారణమయ్యాయి. ఖైబర్‌పఖ్తుంక్వా, బలూచిస్థాన్‌డాన్ ప్రాంతాల సరిహద్దులు పాకిస్థాన్‌అఫ్ఘాన్ మధ్య సాంప్రదాయికంగా ఉద్రిక్తతకు గురయ్యే ప్రాంతాలుగా ఉన్నవి. ఇక్కడ సరిహద్దు నియంత్రణలు తక్కువగా ఉండటం, వాహనాలు, సైనికాలు స్వేచ్ఛగా కదలడాన్ని సులభం చేస్తుంది. ఇలాంటి భౌగోళిక పరిస్థితులు, రాజకీయ సంక్షోభాలు కలిసే సమయంలో ఘర్షణలు ఎప్పుడైనా చోటు చేసుకునే అవకాశాన్ని పెంచుతాయి. ఈ ఘటనలు ప్రాథమికంగా మూడు దశల్లో జరిగాయి. మొదట, పాక్ ఫైటర్ జెట్లు కాబుల్‌లోని టీటీపీ స్థావరాలను గాయం చేయడం ప్రారంభించాయి. తరువాత, తాలిబాన్ సైన్యాలు ప్రతీకార చర్యల్లో పాల్గొని, పాక్ సరిహద్దులలో దాడులు చేపట్టాయి. చివరిగా, స్థానిక సైనిక మరియు పౌరులు, ఈ ఘర్షణల మధ్య భయాందోళనలో వ్యక్తమవుతున్నాయి. ప్రజాసంక్షేమం ప్రభావితమైంది. ప్రత్యామ్నాయ దృక్పథాన్ని పరిశీలిస్తే, సమస్యను కేవలం సైనిక చర్యల ద్వారా పరిష్కరించడం సరైన మార్గం కాదు. స్థానిక అనలిస్టులు సూచిస్తున్నట్లు, టీటీపీ స్థావరాలను ధ్వంసం చేయడం మాత్రమే తాత్కాలిక పరిష్కారం. దీర్ఘకాలికంగా, ప్రాంతీయ రాజకీయ, భద్రతా సమస్యలను సమగ్రంగా ఎదుర్కోవడం అవసరం. దాదాపు అన్ని ఘర్షణల సందర్భాలలో, ఉగ్రవాద గ్రూప్‌లకు భూభాగ సురక్షిత ప్రాంతాలు లభించడం ప్రధాన కారణం. దీనిని అరికట్టకపోతే, సరిహద్దు ఘర్షణలు మరింత తీవ్రతకు చేరతాయి.అలాగే, ప్రాంతీయ కోఆర్డినేషన్, సమాచార మార్పిడి, సరిహద్దు మానిటరింగ్ వ్యవస్థల పునఃసృష్టి, మరియు కౌంటర్‌టెర్రరిస్ట్ ఆపరేషన్లలో పారదర్శకత అవసరం. అఫ్ఘాన్ పాక్ పరస్పర భద్రతా సహకారం, అంతర్జాతీయ మానిటరింగ్, మరియు టీటీపీ వంటి ఉగ్రవాద సంస్థలపై కఠినంగా చర్యలు తీసుకోవడం, రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను తగ్గించడానికి కీలకం. ప్రస్తుతం, ఈ ఘర్షణల ప్రభావం కేవలం సైనిక మరియు భౌగోళిక పరిమాణాలకే పరిమితం కాకుండా, ఆర్థిక, సామాజిక పరిణామాలను కూడా ప్రభావితం చేస్తోంది. సరిహద్దు గ్రామాల్లో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు, వాణిజ్య కార్యకలాపాలు ఆగిపోతోన్నాయి. దీని కారణంగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతని తగ్గించడానికి సమగ్ర పరిష్కారం అవసరం. పాక్‌అఫ్ఘాన్ సరిహద్దు ఘర్షణలు టీటీపీ స్థావరాలపై పాక్ దాడులు, ప్రతీకార చర్యలతో ముడిపడి ఉన్నాయి. భౌగోళిక, రాజకీయ, సైనిక, ప్రాంతీయ అంశాలు కలిసి ఈ ఉద్రిక్తతకు తోడ్పడుతున్నాయి. సైనిక చర్యలతో తాత్కాలిక పరిష్కారం సాధ్యమయినప్పటికీ, దీర్ఘకాలిక పరిష్కారం కోసం రాజకీయ, భద్రతా, మరియు అంతర్జాతీయ మానిటరింగ్ వ్యవస్థలను సమీకరించడం అవసరం.

# బనకచర్లపై మళ్లీ వివాదం

మొదటిపేజీ తరువాయి

సహా పలు పార్టీలు ఈ ప్రాజెక్టును తెలంగాణకు “నీటి అన్యాయం”గా పేర్కొంటూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నేతలు దీనిపై రాజకీయ లాభనష్టాలకే తెలంగాణ కాంగ్రెస్ ఆసరా తీసుకుంటోందని విమర్శిస్తున్నారు.



**ప్రాజెక్టు వివరాలు**

బనకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా పరిధిలో ప్రతిపాదించబడింది. ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం గోదావరి జలాలను ఎత్తి రాయలసీమ ప్రాంతానికి తీసుకురావడం, సాగునీటి అవసరాలు తీర్చడమే. సమాచారం ప్రకారం, ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 60 టీఎంసీల నీటిని వినియోగించే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం మాత్రం “మిగులు జలాలు” ఆధారంగా ఈ ప్రాజెక్టును ప్రణాళిక చేసింది అని చెబుతోంది. కానీ తెలంగాణ నిపుణులు ఈ వాదనను తిరస్కరిస్తున్నారు. గోదావరి ‘మిగులు జలాలు’ అనే నిర్వచనం స్పష్టంగా లేదని, ఏ సమయంలోనైనా దిగువకు జలప్రవాహం తగ్గే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

**ఉత్తమ్ కుమార్ రెడ్డి స్థానం**

కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "బనకచర్ల ప్రాజెక్టు అనుమతిస్తే తెలంగాణ రైతుల భవిష్యత్తు సంకటంలో పడుతుంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన అభిప్రాయం ప్రకారం, ప్రాజెక్టు అమలు అయితే కాళేశ్వరం, దేవాదుల, సీతారామ, ఇతర సాగు ప్రాజెక్టులపై నీటి ఒత్తిడి పెరుగుతుంది. ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, “అంతర్రాష్ట్ర ఒప్పందాలను ఉల్లంఘించేలా ఏపీకి అనుమతులు ఇవ్వడం ఎలా సమంజసం?” అని ప్రశ్నించారు. ఉత్తమ్ అభిప్రాయం ప్రకారం ఇది నీటి వివాదం మాత్రమే కాక రాజకీయ ప్రయోజనాల కోసం నడిపే ప్రాజెక్టు కూడా అని పేర్కొన్నారు. తెలంగాణ పక్షాన జలవిహార బోర్డు సమావేశాన్ని తక్షణమే నిర్వహించి ఈ అంశాన్ని అధికారికంగా చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ ప్రతిస్పందన**

మరోవైపు, బీఆర్ఎస్ నేతలు మాత్రం కాంగ్రెస్ వాదనలను “రాజకీయ నాటకం”గా అభివర్ణిస్తున్నారు. మాజీ మంత్రులు మాట్లాడుతూ, “బనకచర్ల అంశం కొత్తది కాదు; మేము అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుపై పరిశీలన జరిపాము. అప్పటి కేంద్రం కూడా మిగులు జలాల అంశంపై స్పష్టత ఇవ్వలేకపోయింది” అని తెలిపారు. వారు కేంద్రం అనుమతి ఇవ్వకపోతే ఈ ప్రాజెక్టు ముందుకు సాగదని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, గోదావరిలో తెలంగాణ వాటా సురక్షితంగా ఉందని చెబుతున్నారు. అదే సమయంలో, రాజకీయంగా ఏపీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలను పెంచి తమదైన లాభం కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

**ఆంధ్రప్రదేశ్ వాదన**

ఏపీ ప్రభుత్వం తమవైపు నుంచి “మిగులు జలాల వినియోగం” అనే వాదనను బలంగా ముందుకు తెస్తోంది. గోదావరిలో ప్రతీ సంవత్సరం లక్షల కోట్ల లీటర్ల నీరు సముద్రంలో కలుస్తుందని, వాటిలో కొంతభాగం వాడుకోవడం తప్పేమీ కాదని అధికారులు చెబుతున్నారు. వారికి అనుసరించి, ప్రాజెక్టు నీటిని అవసరమైన శాస్త్రీయ ప్రమాణాలతో ఎత్తుకోవడం జరుగుతుంది, పైగా ఇది ఇప్పటికే కేటాయింపుల్లో అడ్డంకులు సృష్టించదని చెబుతున్నారు. అయితే, తెలంగాణ నిపుణులు ఈ వాదనపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గోదావరి ప్రవాహం సీజనల్ మార్పులకు లోనవుతోందని, వర్షాభావ పరిస్థితుల్లో దిగువ రాష్ట్రాలు — ముఖ్యంగా తెలంగాణ — నష్టపోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

**నిపుణుల విశ్లేషణ**

హైదరాబాద్లోని జలసాధన నిపుణుడు డాక్టర్ పల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ, “బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం అనుమతిస్తే, ఇది గోదావరి ఆఖరు రాష్ట్రం అయిన తెలంగాణపై తక్షణ ప్రభావం చూపుతుంది” అని స్పష్టం చేశారు. ఆయన అంచనా ప్రకారం, “జలవిభజన ఒప్పందం ప్రకారం ఏపీకి అదనంగా నీటి హక్కు లేదు. కేంద్రం ఈ విషయంలో రాజకీయ ఒత్తిడికి లోనైతే, ఆ తర్వాత జలపోరాటం తప్ప మరేమీ ఉండదు” అని హెచ్చరించారు. విశ్లేషకులు, బనకచర్ల ప్రాజెక్టు పర్యావరణ అనుమతులు, వ్యయాభివృద్ధి, అంతర్రాష్ట్ర చట్టాల అనుసరణ వంటి పలు సాంకేతిక అంశాల్లో స్పష్టత లేనిదిగా పేర్కొంటున్నారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి లేకుండా ప్రాజెక్టు ఆమోదం ఇవ్వడం చట్టపరంగా కూడా సవాళ్లను ఎదుర్కొంటుందని నిపుణుల అభిప్రాయం.

**కేంద్రం పాత్రపై సందేహాలు**

కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై తేటతెల్లమైన నిర్ణయం ప్రకటించలేదు. కానీ ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు నీటి వనరుల శాఖ వర్గాలు తెలిపాయి. తెలంగాణ ప్రభుత్వం జలవిహార బోర్డు ద్వారా ప్రతిపక్షాన్ని ఐక్యంగా నిలబెడుతుందా అనే అంశం కీలకంగా మారింది. రాజకీయంగా కూడా ఈ ప్రాజెక్టు తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యేకించి, తెలంగాణలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ జలవినియోగం అంశాన్ని తమదైన వాదనగా వినియోగిస్తున్నాయి. కాంగ్రెస్ కేంద్రపై ఒత్తిడి, బీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సాధన, బీజేపీ ప్రతీకార రాజకీయం అని ఆరోపణలు —— ఇలా బనకచర్ల ప్రాజెక్టు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల కేంద్రంగా మారింది. బనకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రస్తుతం కేవలం ఇంజనీరింగ్ అంశం కాదని స్పష్టమవుతుంది. ఇది తెలుగు రాష్ట్రాల మధ్య నీటి హక్కు, అధికార సమతుల్యత, రాజకీయ ప్రతిష్ఠ*ల మధ్య నడుస్తున్న పోరాటానికి ప్రతీకగా నిలుస్తోంది. తెలంగాణకు నీటి కేటాయింపులు తగ్గిపోతాయనే భయాలు వాస్తవమా కాదా అన్నది కేంద్రం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. కానీ ఒక్క విషయం మాత్రం స్పష్టం. గోదావరి జలాలను పంచుకోవడంలో న్యాయం జరిగే వరకు బనకచర్ల వివాదం ముగిసేలా కనిపించడం లేదు.

# బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- ఖాళీ ప్రదేశాలలో మాత్రమే దుకాణాల ఏర్పాటు చేయాలి
- అనుమతి లేకుంటే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు



**మెదక్, అక్టోబర్ 12 (ప్రజా స్వరం) :**

బాణాసంచా విక్రయాలకు దుకాణాల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో ఎస్పీ మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా మెదక్ జిల్లా పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తమ తమ సంబంధిత సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని ముందస్తుగా అనుమతి పొందాలని తెలిపారు. దీనికి సంబంధించిన ఇతర వివరాలు, మార్గదర్శకాలు కోసం సంబంధిత సబ్ డివిజనల్ పోలీస్ అధికారిని సంప్రదించాలని కోరారు. అలాగే ఎటువంటి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు నెలకొల్పిన వారు పట్ల ఎక్స్ప్లోసివ్ యాక్టు - 1884, రూల్స్ - 1933 (సవరణ 2008) ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. టపాకాయల దుకాణాలు ఖాళీ ప్రదేశాలలో మాత్రమే నెలకొల్పాలని, ఆ ప్రదేశానికి సంబంధించి ఎన్ఓసీ సర్టిఫికేట్ తప్పనిసరిగా పొందాలని అన్నారు. ఒక క్లస్టర్లో 50 షాపులకు మించరాదని అన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో, కళ్యాణ మండపాలు లేదా సమావేశ కేంద్రాలలో టపాకాయల షాపులు ఏర్పాటు చేయరాదనీ అన్నారు. తాత్కాలిక టపాకాయల షాపుల్లో అగ్నికి సంబంధించిన భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును సంబంధిత డీఎస్పీ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు.

# పీఆర్టియూ టీఎస్ అధ్యక్షుడిగా మేడి సతీష్ రావు



**మెదక్, అక్టోబర్ 12 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా పీఆర్టియు టీఎస్ జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా మేడి సతీష్ రావు ని జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేడి సతీష్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని అదే విధంగా సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాఖ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్, ఎన్నికల అధికారులు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మానయ్య, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర జిల్లా మండల శాఖ బాధ్యులు పాల్గొన్నారు




# పార్టీ బలోపేతమే ముఖ్య లక్ష్యం

- అన్ని వర్గాల స్థాయి కార్యకర్తల అభిప్రాయ సేకరణ
- పని చేసే వారికి సముచితన స్థానం
- జిల్లా అధ్యక్ష పదవి కోసం దరఖాస్తుల స్వీకరణ
- ఉత్తరాఖండ్ రాష్ట్ర మహిళా అధ్యక్షులు, ఏఐసిసి అబ్జర్వర్ జ్యోతి రౌతెల

**మెదక్ అక్టోబర్ 12 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉత్తరాఖండ్ మహిళా అధ్యక్షులు, ఏఐసిసి అబ్జర్వర్ జ్యోతి రౌతెల, స్టేట ్అబ్జర్వర్స్ అన్సారీ, సంగిశెట్టి జగదీష్, వరలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఐసిసి పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నిక కోసం దరఖాస్తుల స్వీకరించి, వారిపై పార్టీ లోని నాయకుల, కార్యకర్తల అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలను గుజరాత్ లో ప్రారంభించి రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా మీదుగా తెలంగాణకు రావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అన్ని వ్యవస్థలను పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. పారదర్శక ఎన్నిక కోసం అన్ని వర్గాల స్థాయి కార్యకర్తల నుండి వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. మండలం, బ్లాక్, జిల్లా స్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు సందర్శిస్తున్నామన్నారు. పార్టీలో పని చేసే నాయకులకు సముచిత ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఈ నెల 22 న ఏఐసీసీ కి నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ ఉద్దీన్, పీసీసీ సభ్యులు సుప్రభాత రావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మనోహరాబాద్ ఇంచార్జీ మహిపాల్ రెడ్డి, నాయకులు ప్రశాంత్ రెడ్డి, మ్యాడమ్ బాలకృష్ణ, బొజ్జ పవన్, రాజేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్స్ పోలియోను ప్రారంభించిన తుంకి రమేష్

**శామీర్ పేట అక్టోబర్ 12(ప్రజాస్వరం) :**

దేశవ్యాప్తంగా పోలియో నిర్మూలన దిశగా కొనసాగుతున్న పల్స్ పోలియో కార్యక్రమం ఆలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మజీద్ పూర్ గ్రామంలో ఆదివారం మున్సిపల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ ప్రారంబించారు. అంగన్వాడీ వద్ద ప్రారంభించి చిన్నారులకు తొలి పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు ప్రతి చిన్నారి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలని. పోలియో లాంటి దారుణ వ్యాధి నుంచి మన పిల్లలను కాపాడాలంటే ప్రతి తల్లిదండ్రులు చైతన్యంగా ముందుకు రావాలి అని అన్నారు. పోలియో నిర్మూలన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, తల్లిదండ్రులు సమీప పోలియో బూత్‌లను సంప్రదించి సేవను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, గ్రామ మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి, డాక్టర్ విజయనిర్మల, సూపర్వైజర్ వినోద, ఆశ అబ్బాగౌనీ లావణ్య, మాజీ సర్పంచ్ ఏళ్ల మల్లేష్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి, గిర్మాపూర్ నర్సింగ రావు గౌడ్ కుడుముల వెంకటేష్, సాంఘిక సంక్షేమ కాలేజీ డిగ్రి విద్యార్థులు చిన్నారులు, అంగన్వాడీ కార్యకర్త కరుణ, రాణి పాల్గొన్నారు.



# తోటకూర వజ్రేష్‌ను కలిసిన ఎద్దు నాగేష్



**శామీర్‌పేట, అక్టోబర్ 12 (ప్రజాస్వరం) :**

తుంకుంట మున్సిపాలిటీ పరిధిలో వివిధ కాలనీలలో సమస్యలపై పరిష్కరించాలని ఆదివారం తూముకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ యాదవ్ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కాలనీలలో సమస్యలపై చర్చించడం జరిగింది. ఇందుకు గాను సమస్యలను వెంటనే ఇంచార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి త్వరలనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సందడి సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**శామీర్ పేట అక్టోబర్ 12(ప్రజాస్వరం) :**

ముడుచింతలపల్లి మున్సిపాలిటీ కొల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేలనం ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. 2001 02 విద్యాసంవత్సరం చెందిన పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని తమకు విద్య బోధించిన గురువులను పాదాభివందనంతో పూలదండలతో, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలు బహుమతులు అందజేశారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అల్లరి చిల్లరి పనులను గుర్తు చేసుకుంటూ సంతోషంగా సందడిగా గడిపారు. ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులతో గడిపిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతము పూర్వ విద్యార్థులు తాము ఏ రంగంలో ఉన్నాము ఎవరెవరు ఏ ఉద్యోగాలు చేస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మిత్రులందరికీ వద్ద కలవడంతో వారిలో ఆనందం వెల్లి విరిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో గడిపిన విద్యార్థులు ఆటలు పాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్య, పరిశుభ్రత, సామాజిక బాధ్యతలపై అవగాహన ర్యాలీ



**శామీర్‌పేట, అక్టోబర్ 12 (ప్రజాస్వరం) :**

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, జగత్‌గిరిగుట్ట విద్యార్థినులు ప్రత్యేక ఎన్ ఎస్ఎస్ శిబిరం నాలుగో రోజు ఆదివారం మజీద్‌పూర్ గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినులు పల్స్ పోలియో టీకా కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలకు టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామ రహదారులు, దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. అనంతరం ఆరోగ్య, పరిశుభ్రత, సామాజిక బాధ్యతలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఎన్ ఎస్ఎస్ సభ్యురాలు జి.ధనవేణి, ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించారు.

# ‘సబ్ నేషనల్ పల్స్ పోలియో ప్రోగ్రామ్’



**శామీర్‌పేట, అక్టోబర్ 12 (ప్రజాస్వరం) :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో "సబ్ నేషనల్ పల్స్ పోలియో ప్రోగ్రాం"ను లాంచనంగా ప్రారంభించారు. ఉప్పల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి, పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని ప్రజలను కోరారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి మల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం వివిధ పోలియో బూత్‌లను సందర్శించి పర్యవేక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మొదలైన వారు పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డా. ఉమా గౌరి మాట్లాడుతూ, జిల్లాలో 5,24,973 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయవలసి ఉందని, ఇందుకోసం 1125 బూతులు, 31 మొబైల్ టీమ్స్, 31 ట్రాన్సిట్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనంగా, మైగ్రెంట్ జనాభాకు చెందిన పిల్లలు మరియు హై రిస్క్ ప్రాంతాల్లో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు అందించేందుకు వైద్య అధికారులు, సిబ్బంది మొబైల్ టీమ్స్ ద్వారా వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నేటి నుండి అనగా అక్టోబర్ 13 నుండి 15 వరకు మూడు రోజులపాటు సిబ్బంది గృహ గృహాలకూ వెళ్లి, ఈరోజు పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ముగిసే నాటికి 100% పిల్లలకు పోలియో చుక్కలు వేయించి, జిల్లాలో పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రభుత్వ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, ప్రోగ్రాం అధికారులు, జిల్లా ఇమ్యూనైజేషన్ టీమ్, వైద్యాధికారులు, పిహెచ్‌సి సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.



# మానవత్వం చాటిన మైనంపల్లి

**మెదక్ అక్టోబర్ 12 (ప్రజా స్వరం) :**

మెదక్ మండలం కొంటూర్ గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో మెదక్ పర్యటన ముగించుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు తన కారు ను ఆపారు. సంఘటన ఎలా జరుగిందో స్థానికులను అడిగి తెలుసుకున్నరు. ఈ సంఘటన లో ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా క్షతగాత్రులను 108 కి కాల్ చేసి అంబులెన్సు సహాయంతో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

# వేద విద్యార్థి శివరామ కృష్ణకు "మూలపాటి" పట్టా అందించిన కంచి పీఠాధిపతి



**గజ్వేల్ , అక్టోబర్ 12 (ప్రజా స్వరం) :**

కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా కృష్ణ యజుర్వేద విద్యార్థి ఉప్పల శివరామకృష్ణకు "మూలపాటి" పట్టా అందించారు. వర్గల్ శ్రీ శారదాస్మార్థవేద విద్యాలయ పూర్వ ప్రధాన ఆచార్యులు, ములుగు మండలం వంటిమామిడికి చెందిన వేద గురువు ఉప్పల అనంతగిరి శర్మ, ఉప్పల శ్వేత దంపతుల కుమారుడు చిరంజీవి శివరామకృష్ణ యజుర్వేద వేద విద్యలో ప్రతిభ చాటుతుండగా, చాతుర్మాస్య దీక్షలో ఉన్న కంచి పీఠాధిపతి ప్రశంసిస్తూ శివరామకృష్ణను ఆశీర్వదించారు. ప్రాచీన వేదాలు అభ్యసించిన తమ కుమారుడు శివ రామకృష్ణ "మూలపాటి" పట్టా అందుకోవడం సంతోషంగా ఉందని అనంతగిరి శర్మ, శ్వేత దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా వేదాలు ప్రాచీన సంపదకు మూలాలు కాగా, నాలుగు పవిత్ర గ్రంధాల సమిష్టి అని కంచి పీఠాధిపతి స్పష్టం చేశారు. మూలపాటి అనే పదం వేదాల, సనాతన గ్రంథాల ప్రామాణికతను సూచిస్తుందని కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి పేర్కొన్నారు.



# బంగారు భవిష్యత్‌కు పల్స్ పోలియో తప్పనిసరి

- **జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కంఠం కృష్ణారెడ్డి**

**శామీర్‌పేట అక్టోబర్ 12(ప్రజాస్వరం) :**

అలియాబాద్ మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,ఆలియాబాద్ మాజీ సర్పంచ్ కంఠం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజ స్థాపనకు 5 సంవత్సరాల వయస్సు లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి అని సూచించారు. మన పరిసరాల చుట్టూ ఉండే 5 సంవత్సరాల వయస్సు లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం మనందరి బాధ్యత అని అన్నారు. మన దేశంలో 1995 లో మొదలై నేటికి కొనసాగుతున్న పల్స్ పోలియో కార్యక్రమం గొప్ప విజయాన్ని సాధించి, భారత దేశం పోలియో ఫ్రీ దేశంగా డబ్ల్యూహెచ్వో నుండి గుర్తింపు పొందడంలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు తల్లి తండ్రులు తప్పకుండా పల్స్ పోలియో గురించి అవగాహన కలిగి వుండాలని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బందిని, మునిసిపల్ సిబ్బందిని, సహకరించిన ప్రజలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా.విజయకుమారి, ఆశలు లలిత తదితరులు పాల్గొన్నారు.

# ఎదురుగా వచ్చిన బైక్స్ ఢీ ఒకరి మృతి..




**మెదక్ అక్టోబర్ 12 (ప్రజా స్వరం) :**

ఎదురెదురుగా వచ్చిన బైక్స్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ మండల పరిధిలోని కొంటూర్ లో ఆదివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి వస్తున్న బైక్ మెదక్ నుండి వస్తున్న మరో బైక్ ను అతి వేగంగా వచ్చి ఢీ కొనడం జరిగిందని తెలిపారు. ఈ సంఘటన లో మెదక్ నుండి వస్తున్న చిన్న శంకరంపేట మండలం ఎస్ కొండాపూర్ కు చెందిన మూడ సాయిలు (22) అక్కడిక్కడే మృతి చెందడం జరిగిందని అన్నారు. మరో బైక్ తో ఢీ కొట్టిన వ్యక్తి పరారీలో ఉన్నారని అన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



# తైక్వాండో సత్తాచాటిన ఎస్ఎస్ఆర్ విద్యార్థులు

**శామీర్ పేట అక్టోబర్ 12(ప్రజాస్వరం) :**

మూడవ సోమస్ఫేట్ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్షిప్లో మూడుచింతలపల్లిలోని ఎస్ఎస్ ఆర్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. టైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి చేతుల మీదుగా ఎస్ఆర్ఆర్ పాఠశాల పదవ తరగతికి చెందిన మణికంఠ గోల్డ్ మెడల్, 9వ తరగతికి చెందిన వరుణ్ సిల్వర్, ఎనిమిదవ తరగతికి చెందిన సుశాంత్ కాంస్య, సబ్ జూనియ్ కేటగిరి ఆరవ తరగతి శ్రీమాన్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ శ్రీకాంత్, ఎస్ఎస్ఆర్ స్కూల్ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ రాధిక, ఈర్మయ్య విద్యార్థులను అభినందించారు.



# మాజీ ఎంపీపీ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నేతలు


**దౌల్తాబాద్, అక్టోబర్ 12 (ప్రజాస్వరం) :**

తాజా మాజీ ఎంపీపీ గంగాధరి సంధ్యారవీందర్ అత్తగారు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసినదే ఆదివారం ఆమె స్వగృహమైన సూరంపల్లి గ్రామంలో బీజేపీ మండల నాయకులు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. బీజేపీ మండల పార్టీ తరపున నాయకులు సంధ్య రవీందర్ కుటుంబాన్ని కలిసి మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారి దుఃఖంలో తామూ భాగస్వాములమని, కుటుంబానికి దేవుడు ధైర్యం కలిగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు భూపాల్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కురుమ గణేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాస్, బొల్లం స్వామి, బూత్ అధ్యక్షులు కుమార్, వంశీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ సేవా ధృక్పథంతో రాజకీయాల్లో ముందుకు సాగిన రవీందర్ కుటుంబం ప్రజలందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. మండలంలోని పలువురు బీజేపీ కార్యకర్తలు కూడా ఈ సందర్భంగా హాజరై కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడి తల్లి మృతి

**దౌల్తాబాద్, అక్టోబర్ 12 (ప్రజాస్వరం) :**

బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉమ్మడి నరసింహా రెడ్డి గారి మాతృమూర్తి ఉమ్మడి పెంటమ్మ కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలిసిన వెంటనే వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో నరసింహారెడ్డి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పెంటమ్మకు నివాళులర్పించారు. పెంటమ్మ మరణం పట్ల పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం నింపాలని కోరుకున్నారు.





# ప్రతిఘటనకు 40 ఏళ్లు

**విజయశాంతి 'ప్రతిఘటన' చిత్రానికి 40 ఏళ్లు పూర్తి**

**సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్ పెట్టిన రాములమ్మ**

**నన్ను సూపర్‌స్టార్‌గా నిలబెట్టిన చిత్రమన్న విజయశాంతి**

**దర్శకుడు టి. కృష్ణ, నిర్మాత రామోజీరావుకు కృతజ్ఞతలు**

**తెలుగు సినిమాలో మహిళా పోరాటానికి ప్రతీకగా నిలిచిన సినిమా**

**ప్రస్తుతం ఈటీవీ విన్ ఓటీటీలో అందుబాటులో ఉన్న చిత్రం**




తెలుగు సినీ చరిత్రలో మహిళా ప్రాధాన్య చిత్రాలకు ఓ కొత్త దారి వేసిన 'ప్రతిఘటన' విడుదలై నేటికి 40 సంవత్సరాలు పూర్తయింది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆ చిత్రంతో లేడీ సూపర్‌స్టార్‌గా ఎదిగిన విజయశాంతి సోషల్ మీడియా వేదికగా తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సినిమా తన కెరీర్‌లో ఒక మైలురాయి అని, తనకు ఎప్పటికీ ప్రత్యేకమని ఆమె పేర్కొన్నారు. తన కెరీర్‌లో 'ప్రతిఘటన'కు ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. "నన్ను సూపర్‌స్టార్‌గా నిలబెట్టిన సంచలన చిత్రం ప్రతిఘటన" అని ఆమె తన పోస్టులో తెలిపారు. ఈ అద్భుతమైన చిత్రాన్ని అందించిన దర్శకుడు టి. కృష్ణ, ఉషాకిరణ్ మూవీస్ అధినేత రామోజీరావులకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, 'ఈ దుర్యోధన దుశ్శాసన' వంటి ఐకానిక్ పాటను అందించిన గేయ రచయిత వేటూరి సుందరరామమూర్తిని కూడా ఆమె స్మరించుకున్నారు. చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 1985 అక్టోబర్ 11న విడుదలైన 'ప్రతిఘటన' అప్పట్లో ఓ పెను సంచలనం. రాజకీయ అండతో సమాజంలో అరాచకాలు సృష్టిస్తున్న ఓ రౌడీని, ఓ సామాన్య మహిళ ఎదిరించిన కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కింది. మహిళల పోరాట పటిమకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి, విజయశాంతిని తెలుగు సినిమా అగ్ర కథానాయికగా నిలబెట్టింది. విడుదలై నాలుగు దశాబ్దాలు గడిచినా, ఈ చిత్రం ఇప్పటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తూనే ఉంది. 'ప్రతిఘటన' ప్రస్తుతం ఈటీవీ విన్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.



# సీఎం స్టాలిన్ చేతుల మీదుగా కలైమామణి పురస్కారం

- **కళాకారులకు కలైమామణి పురస్కారాల ప్రధానం**
- **వివిధ విభాగాల్లో 90 మంది కళాకారులకు పురస్కారాలు**
- **పురస్కారాలు అందుకున్న వారిలో సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు**

కళారంగంలో విశేష కృషి చేసిన ప్రతిభావంతులను తమిళనాడు ప్రభుత్వం సత్కరించింది. చెన్నైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను "కలైమామణి" పురస్కారాలను ప్రదానం చేశారు. మొత్తం 90 మంది కళాకారులు వివిధ విభాగాలలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. 2021 సంవత్సరానికి గాను నటనా విభాగంలో ప్రముఖ నటి సాయిపల్లవి ఈ పురస్కారానికి ఎంపిక కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా ఆమెకు అవార్డును అందజేశారు. అలాగే, నటులు ఎస్.జే. సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు కూడా పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. సంగీతం, నృత్యం, నాటకం, సినిమా వంటి విభాగాల్లో విశేష కృషి చేసిన కళాకారులను ప్రభుత్వం గుర్తించి సత్కరించింది. కలైమామణి పురస్కారం తమిళనాడులో కళారంగానికిచ్చే అత్యున్నత గౌరవంగా పరిగణించబడుతుంది. ఈ పురస్కారాల ద్వారా కళా సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# కెర్యాంప్... వాళ్ల కోసమే



**కిరణ్ అబ్బవరం కొత్త చిత్రం 'కె-ర్యాంప్'**

**హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగిన ట్రైలర్ విడుదల వేడుక**

**అక్టోబర్ 18న దీపావళి కానుకగా సినిమా రిలీజ్**

**ఊహించని స్థాయిలో తరలివచ్చిన అభిమానులు**

**దీపావళి సినిమాల్లో తమదే పైచేయి అంటున్న నిర్మాత**

**అభిమానులను అలరించడమే లక్ష్యమన్న కిరణ్ అబ్బవరం**

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'కెర్యాంప్' ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలు స్పష్టంగా కనిపించాయి. దీపావళి కానుకగా అక్టోబర్ 18న థియేటర్లలోకి రానున్న ఈ చిత్రంపై చిత్ర బృందం పూర్తి ధీమా వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, అభిమానుల తాకిడికి ఆనందం వ్యక్తం చేశారు. "నన్ను ఎనర్జిటిక్, వినోదాత్మక పాత్రల్లో చూడాలనుకునే నా అభిమానుల కోసమే ఈ సినిమా చేశాను. నా గత చిత్రాలకు ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందులో నా పాత్ర నేటి యువతకు చాలా సులభంగా కనెక్ట్ అవుతుంది. ఈ దీపావళికి కుటుంబంతో కలిసి థియేటర్లలో మనస్ఫూర్తిగా నవ్వుకోవచ్చు" అని అన్నారు. వేదిక వద్దకు రాలేకపోయిన అభిమానులకు ఆయన క్షమాపణలు చెప్పారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ, "ట్రైలర్ లాంచ్‌కు ఇంత భారీ స్పందన వస్తుందని ఊహించలేదు. ఈ దీపావళికి చాలా పెద్ద సినిమాలు విడుదలవుతున్నా, వాటన్నింటి కన్నా 'కెర్యాంప్' ఒక మెట్టు పైనే ఉంటుందని గట్టిగా నమ్ముతున్నాను. పోటీ ఉన్నప్పటికీ, మాకు మంచి థియేటర్లు దొరుకుతాయనే నమ్మకం ఉంది" అని తెలిపారు. సీనియర్ నటుడు నరేశ్ తనదైన శైలిలో మాట్లాడుతూ, "దీపావళికి కొనే పటాసులు కొన్ని నిమిషాలే పేలుతాయి. కానీ 'కెర్యాంప్' టికెట్ కొంటే రెండు గంటల పాటు నవ్వుల పటాసు పేలుతుంది. ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది" అని వివరించారు. దర్శకుడు జైన్స్ నాని మాట్లాడుతూ, "ట్రైలర్‌లో చూసింది సినిమాలోని కొంత ఎనర్జీ మాత్రమే. బడ్జెట్ పెరిగినా నిర్మాతలు వెనకాడకుండా సపోర్ట్ చేశారు. కిరణ్ నటన ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది" అని తెలిపారు. హాస్య మూవీస్, రుద్రాన్ష్ సెల్యులాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండా, శివ బొమ్మక్కు ఈ చిత్రాన్ని నిర్మించారు.



# మరీ ఇంత క్యూట్‌గానా

అందాల భామ "రాశీ ఖన్నా" గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా పరిచయం అక్కర్లేదు. ఈ ముద్దుగుమ్మ ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మొదటి సినిమాతోనే అందం, అభినయం పరంగా మంచి మార్కులు తెచ్చుకుంది. ఆ తర్వాత "జై లవ కుశ", "వెంకీ మామ", "ప్రతి రోజు పండగే" వంటి చిత్రాల్లో నటించి టాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. చివరిగా పక్కా కమర్షియల్, థాంక్యూ సినిమాల తర్వాత ఆమె తెలుగులో మరో సినిమా చేయలేదు. ఇక మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ రీ ఎంట్రీ ఇస్తోంది ఈ భామ. ప్రస్తుతం రాశీ ఖన్నా నటిస్తున్న చిత్రం "తెలుసు కదా". స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ హీరోగా వస్తున్న ఈ సినిమాను దర్శకురాలు నీరజ కోనా తెరకెక్కిస్తున్నారు. కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి కూడా మరో హీరోయిన్ గా చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ట్రైయాంగిల్ లవ్ స్టోరీ కాన్సెప్ట్ తో వస్తున్న ఈ సినిమా అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన టీజర్, సాంగ్స్‌కి ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. దాంతో ఈ చిత్రంపై ఆడియన్స్‌లో భారీగానే అంచనాలు ఉన్నాయి. కాగా మూవీ రిలీజ్ దగ్గర పడటంతో ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచింది తెలుసు కదా మూవీ యూనిట్. ఈ మేరకు రాశీ ఖన్నా ఒక పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. షాకింగ్ కామెంట్స్ చేసింది. ఓ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ఏమీ జరగకుండా నవ్వడానికి నేనేమైనా పిచ్చి ము**నా ? అంటూ ఓపెన్ అయిపోయింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తిట్టు కూడా అంత క్యూట్ గా అనొచ్చా అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999